క్లుప్తంగా

విరివిగా మొక్కలు పెంచాలి


మొక్క నాటుతున్న ఎంపీడీఓ గోపీకృష్ణ

పాములపాడు: మొక్కలను విరివిగా పెంచాలని ఎంపీడీఓ గోపీకృష్ణ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు నాటి పెంచడం వల్ల అందరికీ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలక భూమిక పోషిస్తాయన్నారు. అంతకు మునుపు అధికారులు, అంగన్‌వాడీలు ప్రతిజ్ఞ చేశారు.

రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను జయప్రదం చేయండి


రాష్ట్రస్థాయి వర్క్‌షాపు కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: వాల్మీకుల అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని ఏపీ వాల్మీకి బోయ సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం ఎం.లింగాపురం గ్రామంలో కరపత్రాల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయలు కోల్పోయిన రాజ్యాంగ హక్కులు, సంక్షేమం, అభివృద్ధి, సాధికారత కూడిన డిమాండ్స్ పైన అవగాహన కోసం ఈనెల 22న కర్నూలు జిల్లాపరిషత్ హాల్‌లో రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాల్మీకి బోయలు అందరూ తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కుష్టు వ్యాధిపై అవగాహన


కుష్టు వ్యాధి గురించి తెలియజేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున

పాములపాడు: కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని డీపీఎంఓ వెంకటేష్ నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ శరీరంపై పాలిపోయిన రాగి రంగు మచ్చలు ఉన్నప్పుడు, వాటికి స్పర్శ జ్ఞానము లేనప్పుడు కుష్టుగా అనుమానించాలన్నారు. వెంటనే ఆరోగ్య కార్యకర్తను సంప్రదించి, తగిన సలహాలు తీసుకొని చికిత్స చేయించుకోవాలని సూచించారు. తొలి దశలోనే చికిత్స చేయడం వల్ల వైకల్యాన్ని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, అధ్యాపక సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

పాఠశాలల వద్ద పొగాకు ఉత్పత్తులు అమ్మరాదు

కొత్తపల్లి: గ్రామాల్లోని పాఠశాలలకు సమీపంలోని దుకాణాల్లో సిగరెట్లు, బీడీలు, గుట్కా, పాన్‌పరాక్ వంటి పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదని ఎస్‌ఐ ఎం.కేశవ హెచ్చరించారు. గురువారం మండలకేంద్రంలోని కిరాణం దుకాణాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా నకిలీ సిగరెట్లు, బీడీలు విక్రయిస్తుండటంతో నాలుగు కిరాణం దుకాణాల యజమానులకు రూ.800 జరిమానా విధించారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి గురువారం లోక కల్యాణం కోసం విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

విద్యతో పాటు క్రీడలూ ముఖ్యం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

ఆత్మకూరు: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని ఎంఈఓ సురేష్, హెచ్‌ఎం నాగరాజు అన్నారు. గురువారం ఆత్మకూరు ఉన్నత పాఠశాల మైదానంలో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. మొత్తం 15 పాఠశాలల నుంచి 500 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, చెస్ పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి నియోజకవర్గస్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ శివకుమార్, వైస్ చైర్మన్ చంద్రలీల, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత నామమాత్రమే!

- కంపుకొడుతున్న పల్లెలు
- గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం
- ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోయిన చెత్త
- తూతూ మంత్రంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు


నెహ్రూనగర్ బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన చెత్తచెదారం


తూర్పు ప్రాతకోట నివాస ప్రాంతాల సమీపంలో చెత్తకుప్ప

పగిడ్యాల: ప్రభుత్వం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను పదిహేను రోజుల పాటు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. అయితే క్షేత్రస్థాయిలో దానిని అమలు చేసే అధికారులు నామమాత్రపు చర్యలు చేపడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ చెత్తచెదారం పేరుకుపోవడంతో పల్లెలు కంపుకొడుతున్నాయి. ప్రజలకు స్వచ్ఛమైన రక్షిత నీరు అందడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పనిచేసే ప్రదేశంలోనే నివాసం ఉండి ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు జిల్లా కేంద్రాల్లో ఉంటూ పిక్నిక్‌కు వచ్చినట్లు వచ్చి వెళ్లిపోవడం వల్ల గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లనే పారిశుద్ధ్యం లోపించి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛత ఫొటోలకే పరిమితం

మూడు రోజులుగా మండల వ్యాప్తంగా పంచాయతీ అధికారులు నిర్వహిస్తున్న స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు ఫొటోలకే పరిమితం కావడం శోచనీయమని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారం కుప్పలు కుప్పలుగా పేరుకుపోయిన పట్టించుకునే నాథులే లేరు. అలాగే డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, వాటి నిర్మూలనకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చీకటి పడిందంటే చాలు దోమల బెడదతో అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణ కూడా నామమాత్రంగా కొనసాగుతోంది. గ్రీన్ అంబాసిడర్స్‌కు ఇచ్చిన ట్రై సైకిళ్లు నిరుపయోగంగా మారి మూలనపడ్డాయి. నివాస యోగ్యమైన ఇళ్ల సమీపంలోనే చెత్త చెదారం వేయడం వలన ప్రజలు దుర్వాసనతో అల్లాడిపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి నివాస యోగ్యమైన ఇళ్ల మధ్య పేరుకుపోతున్నా చెత్త చెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందులను పిచికారీ చేయించి ఆదుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పేరుకుపోయిన చెత్త

తూర్పు ప్రాతకోటలో నివాసాలకు సమీపంలో సామూహిక మరుగుదొడ్డి పక్కన చెత్తా చెదారం పేరుకుపోయింది. నెహ్రూ నగర్‌లో జిల్లాపరిషత్ స్కూల్ దగ్గర రోడ్డుపై, ఓవర్ హెడ్ ట్యాంక్ సమీపంలో, పడమర ప్రాతకోటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దగ్గరలో బ్రిడ్జి వద్ద చెత్త నిండిపోయింది. పగిడ్యాలలో దేవనగర్ కాలనీ, కుంట వీధిలో డ్రైనేజీలు పూడిపోయి, మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. సాయంత్రమైతే ప్రజలు బయటికి రాలేని పరిస్థితి. వర్షాలు కురిస్తే మురుగంతా రోడ్లపైనే ప్రవహిస్తుంది.


నెహ్రూనగర్ జెడ్పీ పాఠశాల సమీపాన చెత్త దిబ్బ

శానిటేషన్ రెగ్యులర్‌గా చేయిస్తున్నాం

గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమం రెగ్యులర్‌గా కొనసాగుతోంది. మంగళవారం, శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించి శానిటేషన్‌కు సంబంధించిన ఫోటోలు గ్రూప్‌లో కూడా అప్‌లోడ్ చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. గ్రీన్ అంబాసిడర్స్ కూడా ప్రతి రోజు పనిచేస్తున్నారు.

– నాగేంద్రయ్య, ఈఓఆర్డీ పగిడ్యాల

ఇక్కడ అంతా ఉల్టా!

జూపాడుబంగ్లా: ఓ వైపు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా తల్లిపేరుతో ప్రతి ఒక్కరూ మొక్కను నాటి సంరక్షించండి అని చెబుతూ మొక్కలు నాటుతుండగా.. జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మాత్రం అందుకు విరుద్ధంగా ఏపుగా పెరిగిన చెట్లను నరికివేశారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ ఎంతో కృషి చేసి కార్యాలయ పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించగా.. ఇప్పుడున్న తహసీల్దార్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎవరైనా అనుమతుల్లేకుండా చెట్లను ఇష్టారాజ్యంగా నరికితే వాల్టాచట్టం ప్రకారంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరిస్తుంటారు. అయితే తహసీల్దారే వాల్టాచట్టాన్ని ఉల్లంఘించి కార్యాలయంలోని చెట్టును నరికివేస్తే ఎలాగని, తహసీల్దార్‌కు వాల్టాచట్టం వర్తించదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


తహసీల్దార్ కార్యాలయంలో నరికివేసిన చెట్టు

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం


శివపురంలో విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది.


అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ రవికుమార్

కొత్తపల్లి: పౌష్టికాహారం, చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తహీనతను దూరం చేసుకోవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ తెలిపారు. గురువారం మండల పరిధిలోని శివపురం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ మహాఅభియాన్‌లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆడపిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు పౌష్టికాహారం తయారీ, ఆకుకూరలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాజా మొహిద్దీన్, వసంత లక్ష్మీ, శారదమ్మ, రాధాకుమారి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీదేవి, లలితమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మిడుతూరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కలమందలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున నాయక్ అన్నారు. గురువారం మండలపరిధిలో కలమందలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ మహా అభియాన్‌లో భాగంగా విద్యార్థినులకు కిశోర బాలికలకు న్యూట్రిషన్, శానిటేషన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

ఆత్మకూరు: క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దెరువుగూడెంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌష్టికాహారం, పరిసరాల శుభ్రతతో వ్యాధులబారిన పడకుండా ఉంటారన్నారు. గిరిజనులకు క్షయ, బీసీజీ టీకా గురించి అవగాహన కల్పించి, అర్హులైన వారికి టీకా వేశారు. దూమపానం, మద్యపానం అలవాట్లు ఉన్న వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. అతిసారా వ్యాధి బారిన పడకుండా కాచి వడగట్టిన నీటిని తాగాలన్నారు. దోమతెరలు వాడాలని సూచించారు. అనంతరం సీహెచ్‌ఓ మౌనిక, హెల్త్ అసిస్టెంట్ సామక్క, పిల్లలకు టీకాలు వేసి గర్భిణులకు హెచ్‌బీ, షుగర్, బీపీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



చెక్కును అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మహానంది: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని.. అందరికీ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఇటీవల హత్యకు గురైన గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జవ్వాజి దాసు కుటుంబానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రూ.లక్ష ఆర్థిక సహాయం చేశారు. ఆ మొత్తాన్ని శిల్పా చక్రపాణిరెడ్డి గురువారం జవ్వాజి దాసు భార్యకు అందించారు. నంద్యాల పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ

గాజులపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొజ్జయ్య కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండడంతో మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డి గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వరెడ్డి, నాయకులు కొండా మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ గద్దం చంటి, వాల్మీకి సంఘం నాయకులు మీనిగ నారాయణ, కందుల రఘురామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నరసింహులు, కుంచెపు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బండిఆత్మకూరు: మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డి గురువారం నంద్యాలలోని తన కార్యాలయంలో బండిఆత్మకూరు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వారిని ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరూ అధైర్యపడొద్దని.. త్వరలో మంచి రోజులు వస్తాయని ధైర్యం చెప్పారు. అనంతరం అనారోగ్యంతో నంద్యాల ఎస్‌ఐటీసీలో చికిత్స పొందుతున్న ఏ.కోడూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేవదాసును పరామర్శించారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంతజూటూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డిని పరామర్శించారు. ఆయనతో పాటు ఎంపీపీ దేరెడ్డి సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల రమణ, పల్లె మహేంద్ర రెడ్డి, బారెడ్డి ధరణిధర్‌రెడ్డి, నరేద్దుల సుబ్బారెడ్డి, లక్ష్మీరెడ్డి, దూదేకుల మౌలాలి, శివ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న బీజీ రైల్వే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.సుధారాణి

కొత్తపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నంద్యాల బీజీ రైల్వే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నందికొట్కూర్ నియోజకవర్గ ప్రత్యేక అధికారి కె.సుధారాణి గురువారం రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. ముందుగా మండలంలోని చుక్కల భూములకు చెందిన పట్టాలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 20 ఏళ్ల కిందట గ్రామాలలో అప్పటి ప్రభుత్వాలు ఇచ్చిన చుక్కల భూముల పట్టాల వివరాలు పరిశీలించామన్నారు. ఏఏ గ్రామాలలో ఎంత మందికి చుక్కల భూముల పట్టాలు ఉన్నాయి అన్న విషయాలను ఆరా తీశామన్నారు. ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ ల్యాండ్ రీ వెరిఫికేషన్ ప్రక్రియ మొదలు పెట్టిందని, గ్రామాలలోని ప్రతి రెవెన్యూ అధికారి చుక్కల భూములకు చెందిన వివరాలను సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


జ్యోతి ప్రజ్వలనతో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం


జూపాడుబంగ్లాలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సువర్ణమ్మ

మిడుతూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ 14 క్రీడా పోటీలను ఎంఈఓ -2 శ్రీనాథ్‌తో కలిసి ప్రారంభించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, షటిల్, తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సాయితిమ్మయ్య, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి , వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నాయకులు తువ్వా భగీరథ రెడ్డి, వంగాల శివరామిరెడ్డి, గుండం సర్వోత్తమరెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా ఎంపిక పోటీలు

పాములపాడు: స్థానిక ఏఎస్ఆర్ జెడ్పీహై స్కూలులో శుక్రవారం నుంచి 2 రోజుల పాటు ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్, మండల కో ఆర్డినేటర్ రాజశేఖర్ గురువారం తెలిపారు. అండర్-14, అండర్- 17 విభాగాల్లో బాల బాలికలలకు ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో కలిసి ఈ నెల 20వ తేదీన ఉదయం పాములపాడు జెడ్పీహెచ్ఎస్ క్రీడాప్రాంగణం చేరుకోవాలని సూచించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

జూపాడుబంగ్లా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే అనుకున్న లక్ష్యాలను త్వరగా చేరుకోవచ్చని ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీడీఓ నూర్జహాన్, గురుకుల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. గురువారం జూపాడుబంగ్లా అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మండల స్థాయి క్రీడల కో ఆర్డినేటర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మొట్టె బాలయ్య, గురుకుల వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరప్ప, హెల్త్‌సూపర్‌వైజర్ రాముడు, డీటీ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈఓ సుభాన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 మురళీమోహన్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్‌రావు, క్రీడల కో ఆర్డినేటర్ కృష్ణ, ఫిజికల్ డైరెక్టర్‌లు వెంకటేష్, శ్రీధర్‌కుమార్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి క్రీడా పోటీలు

నందికొట్కూరు: ఈ నెల 23 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ సుభాన్ తెలిపారు. గురువారం పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి అండర్-14, అండర్-17 బాల బాలికల పోటీలు దామగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తునట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. సమావేశంలో దామగట్ల జడ్పీ హైస్కూల్ హెచ్ఎం అనిత జీవన్, వ్యాయామ ఉపాధ్యాయులు సుంకన్న, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌రెడ్డి మృతి ఉద్యమానికి తీరని లోటు

నందికొట్కూరు: సీఐటీయూ జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో భాస్కర్‌రెడ్డి మృతదేహానికి సీఐటీయూ, సీపీఎం, ఏఐటీయూసీ, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసి, కార్మికుల గుండెల్లో నిలిచారన్నారు. ప్రజా సంఘాల నాయకులు ఏసురత్నం, రణధీర్, ఫక్కీర్‌సాహెబ్, స్వాములు నివాళులర్పించినవారిలో ఉన్నారు.

రైతులందరితో పంట నమోదు చేయించాలి

నందికొట్కూరు: రైతులందరితో ఈ-పంట నమోదు, ఈ-కేవైసీ తప్పని సరిగా చేయించాలని మండల వ్యవసాయ అధికారి షేక్షావలి ఆదేశించారు. గురువారం పట్టణంలోని ఆత్మ భవనంలో ఎంపీఈఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా ఈ నెల 23వ తేదీలోపు ప్రతి రైతుకు సంబంధించిన ఈ-పంట నమోదు, ఈకేవైసీ చేయాలని సూచించారు.

సరిగెత్తును ప్రశాంతంగా జరుపుకోండి


పీర్ల చావిడీ వద్ద మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

పాములపాడు: మౌలాలిస్వామి సరిగెత్తును ప్రశాంతంగా జరుపుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. గురువారం రాత్రి ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ సురేష్‌బాబులతో కలిసి మండలంలోని వాడాల గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నూతనంగా పీర్ల చావిడీ నిర్మాణం చేపట్టి, కొత్త పీరును కొలువుంచారు. అయితే సమస్యాత్మక గ్రామం కావడంతో పోలీసుల నుంచి అనుమతి రాకపోవడంతో గ్రామంలోని పండుగ జరుగుతుందో లేదోనని అనుమానం గ్రామస్తుల్లో ఉండేది. ఈ నేపథ్యంలో డీఎస్పీ గురువారం సాయంత్రం అనుమతులు ఇచ్చి గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్,


ఎస్ఎన్ తండాలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు


అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర మారుఫ్ ఆసియా అన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని ఆదర్శ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కళాశాలతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో వ్యాధులు దరిచేరవని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఎన్విరాన్‌మెంట్ ఏఈ ఓబులేష్, పట్టణ ప్రణాళిక అధికారి రామకృష్ణ, కళాశాల అధ్యాపకురాలు పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి, కళాశాల ప్రిన్సిపాల్ విష్ణునాగ్, విజయ్, టీబీ సూపర్‌వైజర్ కల్లూరి మస్తానయ్య, ఎన్ఎస్ఎస్ కార్పొరేటర్ కృష్ణ పాల్గొన్నారు. అలాగే ఎస్.ఎన్.తండా గ్రామంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

పరిశుభ్రతను పాటిద్దాం

కొత్తపల్లి: పరిసరాల పరిశుభ్రతను పాటిద్దామని ఎంపీడీఓ మేరి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, అంబేడ్కర్ విగ్రహం వద్ద స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మన ఇంటి వద్దనే కాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా పెట్టుకోవాలన్నారు. అనంతరం స్వచ్ఛత హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు.

తెగుళ్లపై అవగాహన

వెలుగోడు: పంటల్లో సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని మోత్కూరు, మాధవరం గ్రామాల్లో రైతులు సాగుచేసిన పసుపు, వరిని పరిశీలించారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఆయనతో పాటు నంద్యాల డీఆర్సీ ఏఓ హేమలత, రైతు సేవా కేంద్రం ఉద్యోగి నాగలింగం , రైతులు సాయి రెడ్డి సుధాకర్ రెడ్డి ఉన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

బండిఆత్మకూరు: పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మండలంలోని పెద్ద దేవళాపురం గ్రామానికి చెందిన మధుకిరణ్ (20) అనారోగ్య కారణాలతో ఈ నెల 9వ తేదీ పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడివున్న అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆర్యోగం విషమించడంతో గురువారం మృతిచెందినట్లు బండి ఆత్మకూరు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.